# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 13 జూలై 2024


## అందరి సహకారంతో ఆలయ పున: నిర్మాణం చేపడతాం

**సంబేపల్లె, జులై 12, ప్రభాతవార్త:**

అందరి సహకారంతో పురాతనంగా ఉన్న కొత్తపురమ్మ ఆలయ నిర్మాణాన్ని అధునాతన టెక్నాలజీతో పున: నిర్మాణం చేపడతామని కొత్తపురం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామస్థులు, భక్తుల ఆధ్వర్యంలో వేదపండితులు హోమాలు, పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఏడాది లోపు గుడి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. పున: నిర్మాణ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరి శ్రీలత, దుద్యాల సర్పంచ్ ఎద్దుల లక్ష్మీదేవి, మాజీ జడ్పీటీసీ ఉపేంద్రరెడ్డి తదితరులు హాజరయ్యారు.



## మొహరం వేడుకల్లో జనసేన నేత శ్రీనివాసరాజు

**రాజంపేట అర్బన్, జూలై 12, ప్రభాతవార్త:**



మతసామరస్యానికి ప్రతీక మొహం పండుగ అని రాజంపేట పార్లమెంట్ నియోజకవ్గం ఇన్చార్జి జనసేన నేత ఎల్లటూరి శ్రీనివాసరాజు పేర్కొన్నారు. గురువారం రాత్రి మొహరం ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. రాజంపేట పట్టణంలో ఎంతో వైభవంగా నిర్వహించే మొహరం పీర్ల పండుగ 5వ రోజు సంధర్భంగా నిర్వాహకులు ఆహ్వానం మేరకు జనసేన పార్టీ నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు హాజరయ్యారు. ఈ సంధర్భంగా పీర్ల చావిడి దగ్గర ప్రార్ధనలో పాల్గొన్న యల్లటూరు శ్రీనివాసరాజు. ఈ కార్యక్రమంలో సమ్మెల శివప్రసాద్, కట్టారు బాబు, మౌలా, యాసీన్, ఖలీల్, రహమతుల్లా, మున్నా, జావీద్, సుధీర్, ఇమ్రాన్, హర్శత్, సల్మాన్, సయ్యద్, అనీష్, షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

2024-25లో రూ.13102 కోట్లతో

# జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఆమోదం

**రాయచోటి, జులై 12, ప్రభాతవార్త:**

అన్నమయ్య జిల్లాకు సంబంధించి 2024-25లో రూ.13102 కోట్లతో జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఆమోదించడం జరిగిందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకర్లతో జిల్లా సంప్రదింపులు కమిటీ (డీసీసీ) మరియు జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో నాల్గవ త్రైమాసికం మార్చి 31 నాటికి బ్యాంకులు సాధించిన ప్రగతి, అలాగే 2024-25కు ప్రతిపాదిత వార్షిక రుణ ప్రణాళిక అంశాలపై జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజినేయులు కలెక్టరుకు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 వార్షిక రుణ ప్రణాళికలో త్రైమాజిక చివరి నాటికి జిల్లాలో మొత్తం రూ.11514 కోట్లు లక్ష్యం కాగా రూ.14678 కోట్లు రుణాలు అందించి 127.46 శాతం ప్రగతి సాధించడంపై బ్యాంకర్లను కలెక్టర్ అభినందించారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా జిల్లా ఆర్థిక ప్రగతికి విరివిగా రుణాలు ఇవ్వాలని కలెక్టర్ బ్యాంకర్లను కోరారు. ఈ ఏడాది సాధించాల్సిన లక్ష్యం గురించి వివరించారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకర్లతో కలిసి 2024-25 జిల్లా వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు, ఎస్‌బీఐ ఆర్ఎంపీ మురళీ నాయక్, నాబార్డు ఏజీఎం విజయ్ విహారి, దళిత ఇండస్ట్రియల్ అసోసియేషన్ సభ్యులు రాజశేఖర్, యూనియన్, సభ్యులు రాజశేఖర్, యూనియన్, సప్తగిరి బ్యాంక్ ఆర్ఎంలు, వివిధ బ్యాంకర్లు, జిల్లా అధికారులు, డిక్కీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఖాజీపేట మండలంలో విజృంభిస్తున్న డయేరియా!

**ఖాజీపేట, జూలై 12, ప్రభాతవార్త:**

ఖాజీపేట మండలంలో ఎక్కడ చూసినా డయేరియాతో ప్రజలు అల్లాడుతున్నారు. మండలంలో పలు గ్రామాల్లో కలుషిత త్రాగునీటి కారణంగా వాంతులు, విరేచనాలు సోకి ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం కొరవడడంతో తాగునీరు కలుసితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఖాజీపేట మండలంలో మిడుతూరు గ్రామంలో గురువారం వాంతులు విరోచనాల బారిన పడి బయనపల్లి సునీల్(18) అనే యువకుడు మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు బుధవారం వాంతులు విరోచణాలతో బాధపడుతున్న సునీల్‌ను ప్రొద్దుటూరులోని ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించామని మెరుగైన చికిత్స కోసం కడపకు తీసుకెళ్లామని డాక్టర్లు చెప్పడంతో కడపలో ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించామన్నారు. అక్కడ చికిత్స చేసే క్రమంలో యువకుడు మృతి చెందాడని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో ప్రజలు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న బిఎంహెచ్ఓ నాగరాజు గురువారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను సందర్శించడంతో పాటు మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని సందర్శించి వాంతులు విరేచనాలతో బాధపడుతున్న రోగులను పరీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో కాచి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో సరఫరాగుతున్న నీటిలో డయేరియా వ్యాధికారిక క్రిమి ఆనవాళ్లు లేవని అన్నారు. గ్రామంలోని రెండు ప్రాంతాల్లో నీటి శాంపిల్లను సేకరించి టెస్టింగ్ కోసం ల్యాబ్ కు పంపామన్నారు.

## బియ్యం స్వాధీనం

**దువ్వూరు, జూలై 12, ప్రభాతవార్త:**

దువ్వూరుకు సమీపంలో ఒక ప్రాంతంలో నిల్వ ఉంచిన 10బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దాడులు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఈ దాడులు నిర్వహించామని, ఈ దాడుల్లో రామకృష్ణా అనే వ్యక్తి నుండి 10 బస్తాలు(475కేజీల) చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతనిపై క్రమినల్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు.

మంగంపేట నిర్వాసితులకు పునరావాస పనులను

# వేగవంతం చేయండి



**రాయచోటి, జులై 12, ప్రభాతవార్త:**

మంగంపేట నిర్వాసితులకు పునరావాస పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా కలెక్టర్ శ్రీధర్, మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఏపీఎండీసీ అధికారి మంగంపేటలో గల బెరైటీస్ ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివిధ అంశాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టు నిర్వాసితులకు చేపడుతున్న పునరావాస పెండింగ్ పనుల గురించి ఆర్అండ్‌బీ హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్తు తదితర శాఖలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణరావు, రాజంపేట ఆర్డీవో మోహన్‌రావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ సహదేవరెడ్డి, పీడీ హౌసింగ్ సాంబశివయ్య, గ్రామీణ నీటి సరఫరా శాఖాధికారి ప్రసన్నకుమార్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి దయాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


## ఎంపీ సీఎం రమేష్‌కు ప్రొద్దుటూరులో ఘన స్వాగతం

2లో


# కడప-రేణిగుంట జాతీయ రహదారిని పట్టించుకోరా?

- 2254 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టుకు దిక్కేది? - 100హెక్టార్ల అటవీ క్లియరెన్స్ కోసం ఏడాదిగా పడిగాపులు - కూటమి నేతలైనా చొరవ చూపుతారా?



రైల్వేకోడూరు-రేణిగుంట మధ్య ఫారెస్ట్ క్లియరెన్స్ కావాల్సిన అటవీ ప్రాంతం

**రాజంపేట అర్బన్, జూలై 12, ప్రభాతవార్త:**

గత ప్రభుత్వ హయాంలో ఓ భారీ ప్రాజెక్టు టెండర్లు పూర్తయిన ఏడాది పాటు పనులు జరిగిన పాపాన పోలేదు. 2254కోట్ల విలువైన జాతీయ రహదారి పనులకు దిక్కు లేదు. అడిగే వారు లేరు. పట్టించుకునే వారు లేరు. ఎన్డీఏ ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కడప-రేణిగుంట జాతీయ రహదారి పనులకు ఫారెస్ట్ క్లియరెన్స్ లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది. ఏడాది క్రితం పనులు ప్రారంభించి మరల నిలిపివేశారు. ఫలితంగా ఈ జాతీయ రహదారి పనులు జరుగుతాయా లేక మరల టెండర్లు పిలుస్తారా అన్న అనుమానాలు కూడ వ్యక్తం అవుతున్నాయి. వివరాల్లోకి వెలితే...కడప, అన్నమయ్య తిరుపతి జిల్లాల పరిధిలో 2254కోట్ల వ్యయంతో జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ గత ఏడాది ఆగస్టులో టెండర్లను పిలిచింది. విజయవాడకు చెందిన లక్ష్మి ఇన్‌ఫ్రా అనే సంస్థ 2254.43కోట్ల వ్యయంతో రెండు రీచ్‌లను టెండర్లలో కైవసం చేసుకుంది. దీనికి సంబంధించి అక్టోబర్‌లో టెండర్ల ప్రక్రియ కూడ ముగిసింది. గుత్తేదారులను ప్రకటించారు. అనంతరం ఏ జరిగిందో తెలియదు కానీ పనుల్లో కదలిక లేదు. మూడు జిల్లాల పరిధిలో 100హెక్టార్ల అటవీ భూమి రోడ్డు నిర్మాణానికి అవసరమైంది. దీనికి సంబంధించి అధికారులు వివరాలు సిద్ధం చేశారు. నష్ట పరిహారం చెల్లించేందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ కూడ ముగిసింది. కాదంటే 100హెక్టార్ల అటవీ భూమికి క్లియరెన్స్ లభించాల్సి ఉంది. 122 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారిని రెండు రీచ్‌లుగా విభజించి టెండర్లు పిలిచారు. మొదటి రీచ్‌ను 1245.66కోట్ల అంచనా వ్యయంతో లక్ష్మి ఇన్‌ఫ్రా దక్కించుకుంది. రెండో రీచ్‌ను కూడ 1053.39 కోట్లతో అదే సంస్థ దక్కించుకుంది. గతంలో రెండు వరుసల రహదారి నిర్మణం సమయంలో అటవి శాఖ నిబంధనలను ఉల్లంఘించారని సమాచారం. అటవి శాఖ పూర్తిగా కఠినంగా వ్యవహరించిందని ప్రచారం జరుగుతుంది. రాజంపేట, తిరుపతి, కడప ఫారెస్ట్ డివిజన్‌ల పరిధిలోని డిఎఫ్ఓలు పూర్తి స్థాయిలో సమాచారం ఉన్నతాధికారులకు పంపకుండానే ఇక్కడే ఉంచుకున్నట్లు కూడ తెలిసింది. ఫలితంగానే క్లియరెన్స్ పనులు ఎక్కడ నిలిచిపోయాయి. జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కూడ పట్టించుకున్న పపాన పోలేదు. టెండర్ల ప్రక్రియ పూర్తయి ఏడాది దాటుతున్న ఈ ప్రాజెక్టులో కదలిక లేదు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఈ జాతీయ రహదారి ప్రాజెక్టు పట్ల చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉన్నత స్థాయిలో స్పందిస్తే కానీ పనుల్లో కదలిక వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కడప, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలకు చెందిన కూటమి ప్రజాప్రతినిధులు జాతీయ రహదారి నిర్మాణం పనులు జరిగేలా సీఎం, డిప్యూటి సీఎంల దృష్టికి తీసుకువెల్లి ప్రాజెక్టును పట్టాలెక్కించే దిశగా ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పోష్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి




**కడప, జూలై 12, ప్రభాతవార్త**

జిల్లాలో పోష్ చట్టం 2013 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిఆర్ఓ గంగాధర్‌గౌడ్ అధికారులకు సూచించారు. శుక్రవారం గ్రీవెన్స్ హాల్‌లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్మెంట్ అట్ వర్క్ ప్లేస్‌పై శిక్షణ కార్యక్రమం డిఆర్ఓ గంగాధర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు పనిచేసే ప్రదేశల్లో లైంగిక వేధింపులపై పోష్ చట్టం రక్షణ కల్పిస్తుందని తెలిపారు. ఈ చట్టంపై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా స్థాయిలో లోకల్ కంప్లైంట్ కమిటీని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ కమిటీకి చైర్‌పర్సన్గఆ స్పెషల్ కలెక్టర్ కౌసర్‌బాను, కన్వీనర్‌గా ఐసిడిసి పిడి శ్రీలక్ష్మి వ్యవహరిస్తారని, ఇద్దరు ఇతర సభ్యులు ఎక్స్ అఫీసియో సభ్యులు ఉంటారని తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న ప్రతి మహిళకు ఈ చట్టం వర్తిస్తుందని తెలిపారు. ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఎవరైతే మహిళా ఉద్యోగి వేధింపులకు గురైతే ఈ చట్టం ద్వారా పరిహారం దొరుకుతుందన్నారు. పదిమందిపైగా ఉద్యోగులు పనిచేసే ప్రతి ప్రభుత్వ సంస్థల్లో ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీని చైర్‌పర్సన్ ముగ్గురు సభ్యులతో తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఈ కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేసుకుని ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలన్నారు. అలాగే ప్రతి సంవత్సరం ఈ కమిటీ ఆన్యువల్ రిపోర్టును లోక్ కంప్లైంట్ కమిటీకి అందించాలన్నారు. ఈ కమిటీకి మూడు సంవత్సరాలు కాలపరిమితి ఉంటుందని అది ముగిసిన అనంతరం మరల కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. పదిమంది కంటే తక్కువ పనిచేసే సంస్థల్లో ఎవరైనా మహిళలు వేధింపులకు గురైతే మున్సిపాలిటీ స్థాయిలో మున్సిపల్ కమిషనర్‌కు, మండల స్థాయిలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత వ్యక్తికి ఏడు రోజుల లోపల నోటీసు ఇచ్చి 90 రోజుల్లో విచారణ పూర్తి చేసి లోకల్ కంప్లైంట్ కమిటీకి రిపోర్టు పంపించాలని తెలిపారు. ఇందుకు సంబంధించి బాధత మహిళ వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. సంబంధిత ఫిర్యాదు రుజువైతే భారతయ న్యాయసంహిత 75(1) ప్రకారం సివిల్ మరియు క్రిమినల్ శిక్షలు అమలు అవుతాయని తెలిపారు. పోష్ ఆక్ట్ చైర్‌పర్సన్ స్పెషల్ కలెక్టర్ కౌసర్‌బాన మాట్లాడుతూ పోసో యాక్టు 2013పై విస్తృతంగా మండల, విలేజ్‌స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. వేధింపులకు గురైన మహిళల ఫిర్యాదులను నాణ్యతగా పరిష్కారమార్గం చూపాలన్నారు. పోష్ ఆక్ట్ కన్వీనర్ ఐసిడిఎస్ పిడి శ్రీలక్ష్మి మాట్లాడుతూ 1997లో రాజస్థాన్‌లోని భన్వారీదేవి ఆనే మహిళ లైంగిక వేధింపులకు గురైన నేపథ్యంలో సుప్రీంకోర్టు పోష్ ఆక్ట్ 2013 మార్గదర్శకాలు రూపొందించడం జరిగిందన్నారు. ఈ చట్టంపై ఏమైనా సందేహాలు ఇబ్బందులు ఉన్న ఐసిడిఎస్ అడ్వకేట్లను సంప్రదించవచ్చునని తెలిపారు. అలాగే చిన్నపిల్లల సమస్యలపై 1098, మహిళల సమస్యలపై 181, 112 టోల్ ఫ్రీ నెంబర్లకు కూడా ఫోన్ చేసి సమస్యలు తెలపవచ్చున్నారు. శిక్షణా కార్యక్రమం అనంతరం డిఆర్ఓ గంగాధర్‌గౌడ్ చేతులమీదుగా పోస్టర్లను విడుదల చేశరు. ఈ సమావేశంలో దిశా డిఎస్పీ రమాకాంత్, కడప ఇన్‌చార్జి ఆర్డిఓ వెంకటపతి, జమ్మలమడుగు ఆర్డిఓ శ్రీనివాసులు, విద్యాశాఖ అధికారి అనురాధ, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, అడా వైస్‌చైర్మన్ నందన్, డిఆర్‌డిఏ పిడి ఆనంద్‌నాయక్, మెప్మా పిడి సురేషన, బిసి వెల్ఫేర్ అధికారి బ్రహ్మయ్య, తదితల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## విద్యుత్తు సరఫరా నిలిపివేత

**జమ్మలమడుగు, జులై 12, ప్రభాతవార్త:**

జమ్మలమడుగు పట్టణం మరియు మండలం, పెద్దముడియం, మైలవరం, ముద్దనూరు, కొండాపురం మండలాల్లో శనివారం ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు జమ్మలమడుగు విద్యుత్తు శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు జి.రాజగోపాల్, జమ్మలమడుగు అర్బన్ విద్యుత్తు శాఖ ఏఈ డి.రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు కారణంగా విద్యుత్తు అంతరాయం కలుగుతుందన్నారు.

## జీవనోపాధికి వెళ్లి విగతజీవుడయ్యాడు

**తంబళ్లపల్లె, జులై 12, ప్రభాతవార్త:**

జీవనోపాధి కోసం ఓ వ్యక్తి కువైట్ వెళ్లి అక్కడ గుండెపోటుతో విగతజీవుడైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పరసతోపు పంచాయతీ కొండకింద మేకల వారిపల్లెకు చెందిన శ్యామ్ కుమార్‌రెడ్డి(46) మధుప్రియ దంపతులు 2019లో జీవనోపాధి కోసం కువైట్ వెళ్లారు. శ్యాంకుమార్‌రెడ్డి కువైట్‌లో పెట్రోలు బంకుల నిర్వాహకుడిగా పని చేస్తున్నాడు. భార్య మధుప్రియ గృహిణి. ఈనెల 10న శ్యామ్‌కుమార్‌రెడ్డికి హఠాత్తుగా గుండె పోటు రావడంతో అక్కడే చికిత్సలు చేయించారు. అయినా ఫలితం లేక మృత్యువాత పడ్డాడు. ఈ విషయాన్ని ఆయన భార్య, కుటుంబ సభ్యులు మేకలవారిపల్లెలోని బంధువులకు ఫోన్ ద్వారా తెలిపారు. శ్యామ్‌కుమార్‌రెడ్డి మృతితో విషాధచాయలు అలుముకున్నాయి. మృతదేహం శుక్రవారం సాయంత్రం తన స్వగ్రామం కొండకింద, మేకలవారిపల్లికి కువైట్ నుంచి తరలిరావడంతో అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.

## ఉపాధి కూలీల వేతనాలు చెల్లించండి సారూ..

**తంబళ్లపల్లె, జులై 12, ప్రభాతవార్త:**

తంబళ్లపల్లె మండలంలో మూడు మాసాలుగా ఉపాధి హామీ కూలలీఆలు రెక్కలు, ముక్కలు చేసుకొని పనులు చేస్తే ఇంత వరకు బిల్లులు చెల్లించకలేదని ఉపాధి హామీ కూలీలు మొరపెట్టుకుంటున్నారు. మండలంలోని తంబళ్లపల్లె, పరసతోపు, గోపిదిన్నె, ఆర్ఎన్.తాండా, కోసువారిపల్లి, బాలిరెడ్డిగారిపల్లి, గుండ్లపల్లి, కొట్టాల, రేణిమాకులపల్లి తదితర పంచాయతీలలో పెద్దఎత్తున ట్రెంచీలు, ఫారంపాండ్స్, చెరువుల ఆయకట్టులోని కాలువల నిర్మాణ పనులు, నీటి నిల్వ పనులు ముమ్మరంగా చేపట్టారు. వాటికి చెందిన బిల్లులు సుమారు రూ.కోటి వరకు కూలీలకు చెల్లించాల్సి ఉంది. మూడు మాసాలుగా బిల్లులు చెల్లించకపోవడంతో దినసరి కూలీలు జీవనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా స్థాయి ఉపాధి హామీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బిల్లులు చెల్లింపులకు చర్యలు చేపట్టాలని కూలీలు కోరుకుంటున్నారు.

# విద్యార్థులకు బహుమతులు ప్రదానం

**చిట్వేలి, జులై 12, ప్రభాతవార్త:**



చిట్వేలి మండల పరిధిలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినీ విద్యార్థులకు శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మానవతా శాఖ మరియు ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీ వారు నగదు, మెమెంటోలను విద్యార్థులకు బహుకరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 544 మార్కులు సాధించిన విద్యార్థి తేజశ్రీకి మానవతా శాఖ ఛైర్మన్ తిరుమల విశ్వనాథం రూ.5555 నగదును, మానవతా శాఖ దాతలు రూ.1116లు అందించారు. ప్రైవేటు పాఠశాల శ్రీపద్మావతి హైస్కూలు విద్యార్థి 588 మార్కులు సాధింఇ మండలంలో ప్రథమంగా నిలిచిన సౌమ్యకు విశ్రాంత ఉపాధ్యాయుడు మోహన్ రూ.3వేలు నగదును మానవ శాఖ తరుపున రూ.2555 నగదు అందించారు. చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీ వవారఉ దాత సహకారంతో వారి అవ్వా తాత చెట్లూరి సీతమ్మ, రామాచార్యుల జ్ఞాపకార్థం పోలోపల్లి, కె.కందులవారిపల్లి, కస్తూర్బాఆ ప్రభుత్వ పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.5001, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.4001 మొత్తం 6 మందికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు కోదండ నాయుడు, ఈశ్వరయ్య, గ్రామ ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి, కూటమి నాయకులు ఆకేపాటి వెంకటరెడ్డి, అధ్యక్షులు మునిరావు, కార్యదర్శి సాయిరాం, సీహెచ్ఎస్ బాధ్యులు గాడి ఇంతియాజ్ అహ్మద్, గాలా శివారెడ్డి, కందుల నరసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఏడాది ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఇరు శాఖలను స్థానిక ప్రజలు అభినందించారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**బద్వేలు అర్బన్ , జూలై 12 ప్రభాతవార్త :**

బద్వేలు మరియు గోపవరం మండలాల పరిధిలో 33/11కేవి సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా ఉదయం 7.30 గంటలనుంచి మధ్యాహ్నం 1.00గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్ కుళాయప్ప, టౌన్ ఏఈ రమణ, రూరల్ ఏఈ చిన్నయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలందించేందుకు ముందస్తుగా సబ్‌స్టేషన్‌లో అవసరమైన మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 1.00 గంట అనంతరం యదావిధిగా విద్యుత్ సప్లయ్ అందించడం జరుగుతుందని కావున ప్రజలందరూ విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

## అభివృద్ధికి సహకరిస్తా-ఎమ్మెల్యే పుట్టా

**దువ్వూరు, జూలై 12, ప్రభాతవార్త:**



మైదుకూరు నియోజకవర్గంలో ఎక్కడ కూడ అవినీతిని సహించనని పార్టీలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు సహకరిస్తానని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సభా భవన్‌లో మండల ప్రత్యేక సాధారణ సర్వసభ్య సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గంలో ఎక్కువగా కేసీ కాలువ ఆయకట్టు ఉందని సరైన వర్షాలు లేని సమయంలో నీరు అందడం లేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే రాజోలి రిజర్వాయర్ నిర్మాణం ఒక్కటే మార్గం అన్నారు. ప్రస్తుతం రాజోలి ప్రాంతం కర్నూల్ జిల్లాలో ఉందని దానికి కడప జిల్లాలోకి మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కడప జిల్లాకు వస్తే రాజోలి నిర్మాణ పనులు చేపట్టేందుకు మార్గం ఏర్పడుతుందన్నారు. అలాగే ప్రతి గ్రామంలో స్మశాన వాటికలు ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వాటిని గుర్తించి ప్రహారి గోడలు నిర్మించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయిలో అవినీతి జరుగుతుందని తమ దృష్టికి వచ్చిందని అలా జరగకుండా చూడాలన్నారు. లేనిచో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలలో ఎక్కడైనా భూములు ఆక్రమించి ఉంటే వాటి జాబితాను తయారుచేసి ఇవ్వాలన్నారు. వాటిని పేద రైతులకు పంచేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే వివిధ రకాల పెన్షన్‌లలో అర్హత లేని వారికి ఇస్తున్నారని ఎక్కువగా వికలాంగులు, ఆధార్‌లో వయస్సు మార్చడం, ఒంటరి మహిళా, వితంతు పెన్షన్‌లలో తేడాలు ఉన్నాయని వాటిని గమనించి తొలగించాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి అమర్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ దువ్వూరు మండలంలో కేసీ కాలువ ఆయకట్టు కింద వరి సాగు ఎక్కువగా చేస్తారని అందుకు అనుగుణంగా 270క్వింటాళ్ల జనుములు పంపిణీ చేశామన్నారు. అలాగే 9500మెట్రిక్ టన్నులు వ్యవసాయ శాఖ తరపున ఎరువులు కూడ సిద్ధంగా ఉంచామన్నారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలని వాటిని ముందగా ల్యాబోరేటరీలలో మొలక శాతాన్ని పరీక్ష చేయాలన్నారు. అనంతరం రెవెన్యూ, విద్యుత్, ఆరోగ్యం, విద్యాశాఖ తదితర శాఖలపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తూచా తప్పకుండా అధికారులు పాటించాలని పేర్కొన్నారు. కొంతమంది అధికారులు సమావేశానికి రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో పనిచేసే అధికారులు సక్రమంగా విధులు నిర్వహిస్తే ఉండండి లేకపోతే వెళ్లిపోండని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షురాలు పి.రంతున్నీసా, ఎండీఓ సుగుణ శ్రీ, జడ్పీటీసీ ఏరువ కృష్ణయ్య, డిప్యూటి తహసీల్దార్ అలీఖాన్, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## డెంగీ, స్టాప్ డయేరియాపై విద్యార్థులకు అవగాహన

**సంబేపల్లె, జులై 12, ప్రభాతవార్త:**



డెంగీ వ్యతిరేక మాస ఉత్సవం సందర్భంగా పెద్దజంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డెంగీ, స్టాప్ డయేరియాపై రాయచోటి మలేరియా సబ్ యూనిట్ అధికారి ప్రసాద్ శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. డెంగీ స్టాప్ మలేరియా వ్యాధి వ్యాప్తి జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మలేరియా అధికారి మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. జ్వరం, ఒళ్లు నొప్పులు ఉన్నట్లు అనిపిస్తే ఉపకేంద్రంలో కానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యసిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చక్రపాణి, హెల్త్ సూపర్‌వైజర్ సదాశివరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, ఎంఎల్‌హెచ్‌పీ షబ్రీన్, ఉపాధ్యాయులు సుమంత్ సేల్, మురళీ, చంద్రయ్య, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీ సీఎం రమేష్‌కు

# ప్రొద్దుటూరులో ఘన స్వాగతం



**ప్రొద్దుటూరు, జూలై 12, ప్రభాతవార్త:**

గత ఎన్నికల్లో బిజెపి, టిడిపి, జనసేన కూటమి అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా అఖండ మెజారిటి సాధించిన ఎంపీ సీఎం రమేష్ నాయుడు మొట్టమొదటి సారిగా తన సొంత గడ్డ ప్రొద్దుటూరుకు విచ్చేసిన సందర్భంగా ఆయనకు కూటమి నాయకులు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, బిజెపి పట్టణ అధ్యక్షులు వంకధార నరేంద్రరావు ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం ఎంపీ సీఎం రమేష్ నాయుడు ఉదయం 9గంటలకు కడప ఎయిర్‌పోర్ట్ నుండి బయలుదేరి కడప పెద్ద దర్గాను దేవుని కడప వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని బయలుదేరి ప్రొద్దుటూరుకు మధ్యాహ్నం రెండు గంటలకు చేరుకున్నారు. మొదలగా కొత్తపల్లి పంచాయతీ కార్యాలయం దగ్గర సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అపూర్వ స్వాగతం పలుకుతూ గజమాలతో ఘణంగా సన్మానించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి స్థానిక రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగానే ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డితో పాటు కూటమి నాయకులు ఆనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుండి ర్యాలీగా శివాయం కూడలి, రాజీవ్ కూడలి మీదుగా టీబీ రోడ్డు, గాంధీ రోడ్డు, వన్‌టౌన్ కూడలి చేరుకొని ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీగా పోట్లదుర్తికి చేరుకున్నారు. ఎంపీ సీఎం రమేష్ పర్యటన ముందుగా అనుకున్నట్లు కాకుండా ఒక గంట ఆలస్యంగా ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో అడుగడుగునా గజమాలతో ఆయనకు అభిమానులు, టిడిపి, బీజేపి, కార్యకర్తలు నాయకులు నీరాజనం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి సీఎం సురేష్ నాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్, టిడిపి నాయకులు ఈవి సుధాకర్ రెడ్డి, బద్వేలి శ్రీనివాసుల రెడ్డి, రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, టిడిపి యువ నాయకులు దుగ్గిరెడ్డి రఘునాథ రెడ్డి, విద్యుత్ కాంట్రాక్టర్ జొన్నారం వీరారెడ్డి మరియు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## డిప్లమో మొదటి సంవత్సరం ఫలితాల్లో గౌతమి విధ్యార్థినిల ప్రతిభ

**ప్రొద్దుటూరు, జూలై 12, ప్రభాతవార్త:**




ప్రొద్దుటూరు మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లె గౌతమి మహిళా పాలిటెక్నిక్ కళాశాల విధ్యార్థినిలు ఎస్బీ టెట్ విజయవాడ వారు విడుదల చేసిన పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం ఫలితాలో ఉత్తమ ఫలితాలను సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్ రావు తెలిపారు. ఈ ఫలితాలలో డిఇసిఇ విభాగానికి చెందిన వి.పూజ 98.09%, పి.ముని యామిని 97.09%, టి.మౌనిక 96.10% సాధించారని తెలిపారు. అలాగే డిసిఎంఈ విభాగంలో సంగీత 95.7%, ఎల్.యస్సాక్షి 95.3%, అలాగే డిఇఇఇ విభాగంలో ఎం.దివ్యనయన 91.1% సాధించారని తెలిపారు. వీరితో పాటు 25మంది విధ్యార్థినులు కూడ 90శాతంకు పైగా ఫలితాలు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విధ్యార్థినిలను కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూరు రవీంద్రారెడ్డి, కోడైరెక్టర్ శైలూష, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామసుబ్బమ్మ, వివిధ విభాగ అధిపతులు మహమ్మద్ జబీర్, యాకూబ్ అలీ, బాల సుబ్బన్న, విజయమ్మ, అధ్యాపక మరియు అధ్యాపకేరత బృందం పాల్గొన్నారు.

## వైభవంగా వాసవిమాత అమ్మవారికి విశేష పూజలు

**బద్వేలు అర్బన్ , జూలై 12 ప్రభాతవార్త :**



ఆషాఢమాసం పురస్కరించుకుని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్య వర్తకసంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు, సెక్రటరీ నాగరాజ మరియు కమిటి సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజామునుంచే అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చనతో పాటు పలు రకాల పూజలు వైభవంగా నిర్వహించారు. అనంతరం గుడి ఉత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆషాఢమాసం పురస్కరించుకుని పోలీసుస్టేషన్ ఆవరణలో వెలసిన శ్రీ కనకదుర్గ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి వివిధ రకాల ప్రత్యేక ఆకులతో వనాన్ని తలపించేలా కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటి సభ్యులు పబ్బతి చంద్రశేఖర్, సుబ్బరాజా, అశోక్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, నాగభూషణంలతో పాటు పలువురు కమిటి సభ్యులకు ప్రత్యేక తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## 29న కడప కలెక్టరేట్ ఎదురుగా నిరసన

**ప్రొద్దుటూరు, జూలై 12, ప్రభాతవార్త:**



రాష్ట్ర మాల మహానాడు ఆధ్వర్యంలో దళితుల అభ్యున్నతి కోసం అవగాహణ సదస్సులు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కడప ఆర్టీసి బస్టాండ్ సమీపంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ఎదురుగా ఈనెల 29న నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా అధ్యక్షులు పుల్లి కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 29 సోమవారం ఉదయం 10 గంటలకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటి కేసులో రావలసిని నష్ట పరిహారం తక్షణమే అందించాలని హత్యలకు గురి అయిన ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్‌సమానిటరింగ్ కమిటీలు ఏర్పాటుచేయాలని అణగారిన ప్రజల ఉన్నత కోసం దళితులపై కొనసాగుతున్న కుల వివక్షత నిర్మూళన కోసం వారి అభివృద్ధి కొసం ప్రతి నెల అవగాహణ సదస్సులు నిర్వహించాలన్న డిమాండ్లతో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సంగటి పుల్లయ్య, రాష్ట్ర సమన్వయ కన్వీనర్ మేకల యేసురత్నం, మేకల ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## ఆవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో అమ్మవారికి మెహందీ

**బద్వేలు, జూలై 12 (ప్రభాతవార్త):**

ఆషాఢ మాసం పురస్కరించుకుని ఆవోపా మహిళా అధ్యక్షురాలు మాధవి లత, సెక్రటరీ పెసల శ్రీవాణి, వైస్ ప్రెసిడెంట్ సుప్రజ, గంగిశెట్టి ధనలక్ష్మితో పాటు పలువురు మహిళల ఆధ్వర్యంలో ముందుగా వాసవిమాత అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రీన్ కలర్స్‌తో రకరకాల పిండి వంటలను అమ్మవారికి సమర్పించారు. అలాగే వాసవిమాత మాత అమ్మవారికి గ్రీన్‌మెహంది, గాజులు, పసుపు, కుంకుమ సమర్పించి మెహందీ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశేష సంఖ్యలో పలువురు మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మెహందీ కార్యక్రమానికి అవసరమైన డెకరేషన్లను వాసవి ఈవెంట్ యజమాని సునీల్ కుమార్ వారి సహకారంతో నిర్వహించినట్లు తెలిపారు. వాసవిమాత అమ్మవారికి గాజులను డాక్టర్ రాచపూడి దిలీప్ గుప్తా, హైమావతి కుటుంబ సభ్యులు అందజేశారు. అలాగే మెహందీ కార్యక్రమానికి కోన్‌లు పత్తి సూర్యప్రభ, మేడా సునీల్‌కుమార్‌లు సహకరించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, మాజీ అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మి కొంజేటీలక్ష్మి, సుభాషిణి, లక్ష్మి, జూటూరు పద్మ, సూరే రేష్మ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రష ప్రధాన కార్యదర్శి వెంకట్‌కు ఘనంగా సన్మానం

**రామాపురం, జులై 12, ప్రభాతవార్త:**



ఆదివారం విజయవాడ లెనిన్ సెంటర్, డా.బీఆర్ అంబేద్కర్ భవన్‌లో జరిగిన సాంఘిక సంక్షేమ గురుకులాలు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జరిపిన జనరల్ బాడీ నూతన కార్యవర్గ సమావేశ ఎన్నికల్లో రామాపురం డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన డేటా ఎంట్రీ ఆపరేటర్ పి.వెంకట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయనకు కళాశాల ప్రిన్సిపల్ వరప్రసాద్, పాఠశాల యాజమాన్యం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకట్‌కు ఘనంగా సన్మానించి అభినందించారు.

## కారుకు నిప్పంటించుకుని వ్యక్తి మృతి

**పులివెందుల, జూలై 12, ప్రభాతవార్త :**



మద్యం మత్తులో కారుకు నిప్పంటించుకుని ప్రభాకర్‌రెడ్డి (80) అనే వ్యక్తి మృతిచెందారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బొగ్గుడుపల్లెలో ప్రభాకర్‌రెడ్డి అనే వ్యక్తి గత కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగా లేకుండా జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తన కలంలో ఉన్న కారులోకి వెళ్లి పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని మృతిచెందినట్లు సమాచారం. ఈ విషయమై సీఐను వివరణ కోరగా తమ దృష్టికి ఏమీ రాలేదని తెలిపారు.

## అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

**పులివెందుల, జూలై 12, ప్రభాతవార్త :**



పులివెందుల పోలీసుస్టేషన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల అర్బన్ సీఐ ఎ.మోహన్‌కుమార్ అన్నారు. డీఎస్పీ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం మట్కా నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మట్కా నిర్వహించడం వల్ల కలిగే అనర్థాల గురించి వారికి వివరించారు. అనంతరం మట్కా స్థావరాలపై దాడులు చేసి మట్కా నిర్వహిస్తున్న మల్లేల దేవదాసును అదుపులోకి తీసుకుని, ఆయన నుండి రూ.1500నగదు, మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## డయేరియాను అరికట్టలేని దద్దమ్మ ప్రభుత్వం

**వేంపల్లె, జూలై 12, ప్రభాతవార్త :**



డయేరియాను అరికట్టలేని దద్దమ్మ ప్రభుత్వంలా చంద్రబాబు ప్రభుత్వం తయారైందని కాంగ్రెస్‌నేత, మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా డయేరియా ప్రబలుతుండడంతో ఆసుపత్రులు బాధితులతో కిక్కిరిస్తున్నాయన్నారు. ఆయా జిల్లాల్లో పలువురు మృత్యువాత పడగా, మరికొందరు ఆసుపత్రుల పాలయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పారిశుద్ధ్యం పడకేసిందని, సంపద కేంద్రాలు దరిద్ర కేంద్రాలుగా తయారయ్యాయని ఆయన అన్నారు. అలాగే సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికి వందనంపై ప్రజలకు చంద్రబాబునాయుడు ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని ఆయన కోరారు. సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోందని, దీంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారన్నారు.

## అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు

**- రెండు ఆటోలు, 580 కేజీలు బియ్యం సీజ్**

**పెండ్లిమర్రి, జులై 12, ప్రభాతవార్త:**

మండలంలోని నందిమండలం గ్రామంలో ఉచిత రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సీఐ నాగరాజు, ఎస్‌బీ ఆధ్వర్యంలో తమ సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించి 2 ఆటోలను, 580 కేజీల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు పెండ్లిమర్రి పోలీసులు తెలిపారు.

## మెగా ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం చేయండి



**రాయచోటి, జులై 12, ప్రభాతవార్త:**

రాయచోటి పట్టనంలో ఈనెల 14వ తేదీన నిర్వహించతలపెట్టిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎంఏ వెల్ఫేర్ సొసైటీ జనరల్ సెక్రటరీ ఎస్.నహవీల్ బాషా, లైఫ్‌కేర్ క్లినిక్ వైద్యులు డా.జక్రియ అహ్మద్, మాజీ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎస్.కె.హుసేన్‌లు కోరారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శిబిరం ఎంఏ వెల్ఫేర్ సొసైటీ, లైఫ్ కేర్ క్లినిక్, షిఫా ఆసుపత్రిల ఆధ్వర్యంలో నిర్వమించబడుతుందన్నారు. పట్టణంలో ఎక్కువ శాతం పేదలు ఉన్న కొత్తపల్లి ప్రాంత ప్రజల సౌకర్యార్థం శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. శిబిరాన్ని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. శిబిరానికి వచ్చే రోగులకు స్పెషలిస్ట్ డాక్టర్లచే ఉచిత వైద్య సేవలు అందించబడతాయన్నారు. అలాగే రోగులకు అవసరమైన మందులను తమ ఎంఏ వెల్ఫేర్ సొసైటీ తరుపున ఉచితంగా అందజేస్తామన్నారు. రాయచోటితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సొసైటీ సభ్యులు ఎజాస్‌బాషా, షేక్ రబ్బాని, షేక్ మొహ్మద్ గౌస్, ఖాదర్‌బాషా (శివాజీ బీడీ), షేక్ మన్సూర్ అలీ, అభుబకర్, జాఫర్, జబీవుల్లా, షరీఫ్ పాల్గొన్నారు.

## ఇంటిలో చోరీ.. కేసు నమోదు

**కడప క్రైం, జులై 12, ప్రభాతవార్త:**

కడప నగరంలోని వన్‌టౌన్ పీఎస్ పరిధిలో మారుతీనగర్‌లో నివాసం ఉంటున్న చింతల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఈ ఏడాది మార్చి 26న ఉదయం 10 గంటలకు తాళం వేసి మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో బయటికి వెళ్లాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంటిలోని దాదాపు రూ.1.30లక్షలు విలువైన బంగారు ఆభరణాలను అపహరించుకొని వెళ్లారు. 18 గ్రాముల తాళి బొట్టు సరుడు, ఒక జత కమ్మలు, ఒక ఉంగరం చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

# ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

**ఖాజీపేట, జూలై 12, ప్రభాతవార్త:**



ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం నాడు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. తుడుములదిన్నె గ్రామంలో డయేరియా కేసుల గురించి విచారించి రోగులకు వైద్యం ఎలా అందుతుందని డాక్టర్ ముబీన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రై డే డ్రై డే పాటించి ఇంటింటికి తిరిగి సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ముబిన్, జిల్లా ఎపిడమాలజిస్ట్ ఖాజమోద్దీన్, అసిస్టెంట్ మలేరి యా ఆఫీసర్ వెంకటరెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి బి.నాగభూషణం, స్టాఫ్‌నర్స్ సుప్రజ, ల్యాబ్ టెక్నీషి యన్ దుర్గాప్రసాద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**పేరు మార్పు**

షకీల బి (పాతపేరు) భర్త షాజహాన్ ఇంటి నెం. 8-147-ఎ, రవీంద్రనగర్ ఎగువ కురువంక పొన్నుటిపాలెం (గ్రామం) మదనపల్లె (మం.) అన్నమయ్య జిల్లా. ఏపి నేటి నుండి నా పేరు షేక్ షకీలా బానుగా మార్చుకోబడినది. అందరూ గమనించగలరు.

## గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల పూర్తి సమాచారం సేకరించండి : ఎంపీడీఓ



వీరబల్లి, జులై 12, ప్రభాతవవార్త :
గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల వివరాలను సేకరించాలని ఎంపీడీఓ రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయం నందు యంయస్ఓ తో కలసి ఇంజనీరింగ్ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మంజూరై ఇంతవరకు ఇళ్లు పూర్తి చేయని వారి సమాచారాన్ని వారి ఇంటి వద్దకే వెళ్లి సేకరించాలని తెలిపారు. ముఖ్యంగా లబ్దిదారులు ఏ కారణం చేత ఇళ్లు కట్టుకోలేక పోతున్నారో తెలపాలన్నారు. అలాగే ఇసుక, కడ్డీలు,సిమెంట్ తదితర వస్తువులును అందాయా లేదా అని అలాగే వారికి ఏమైనా లోను అవసరమైతే ఉపాధి హామీ పథకం ద్వారా 90రోజుల మ్యాన్ డేస్ మరియు డ్వాక్రా ద్వారా తీసుకొనేలా వారికి తెలపాలన్నారు. అలాగే లబ్దిదారులకు ఏమి అవసరమో తెలుసుకొని వారి ఇంటిని పూర్తి చేయాలన్నారు. అలాగే వారి వివరాలు సేకరించి సోమవారం ఉదయం ఎంపీడీఓ కార్యాలయంలలో 11గంటలకు జరిగే సమావేశంనకు హాజరు కావాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమములో హౌసింగ్ డిఈ మురళీ కృష్ణ, ఏఈ వెంకటేశ్వర్లు, ఏపీయం నాగరాజు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపిపి బహిరంగ క్షమాపణ చెప్పాలి

కురబలకోట, జులై 12 ప్రభాతవార్త :



వైసిపికి చెందిన ఎంపిపి దస్తగిరి బహిరంగ క్షమాపణలు చెప్పాలని మండల టిడిపి నాయకులు జంగా రాఘవరెడ్డి, డిఆర్ వెంకటరమణారెడ్డి, తెట్టుమాజీ సర్పంచ్ శివనారాయణలు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రమంత్రి నారా లోకేష్ పాదయాత్ర సమయంలో ఆయనపై అనుచిత వ్యాఖ్యలుచేసిన ఎంపిపి అంగళ్ళు కూడలి ప్రాంతంలో బహిరంగ క్షమాపణలు చెప్పాలన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కాకుండా దాగుడుమూతలు చేయడం తగదన్నారు. క్షమాపణలు చెప్పకపోతే పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

## నాబార్డ్ వారి సౌజన్యంతో మామిడితోట పెంపకం

లక్కిరెడ్డిపల్లె, జులై 12,ప్రభాతవార్త:



నాబార్డ్వరి సౌజన్యంతో నాబార్డ ఆవరి దినోత్సవం సందర్భంగా వాటర్షెడ్ ప్రాజెక్టు ద్వారా శుక్రవారం బత్తెనవాండ్ల పల్లెలో మామిడి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వాటరెహెడ్ ద్వారా మూడు సంవత్సరాలుగా కస్తెరి రాజుగారిపల్లె గ్రామంలో వాటర్షెడ్ ద్వారా అభివృద్ది కార్యక్రమాలు యేపడుతున్నట్లు ఆయన తెల్పి వాటర్ షెడ్ ద్వారా భూసంరక్షణ,నీటి సంరక్షణ, ఉద్యానవన పండ్ల తోటలు పంపకం, రైతులు జీవనోపాదిన పెంపొందించడం కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కస్తూరిరాజుగాపరిపెల్లలో పంచాయతీలో సైమారు 50 ఎకరాలల్లో మామిడి తోటలు పెంపకం కోసం మొక్కలు అందజేశామన్నారు. ఆర్.హెచ్,జిబి,ఎం ఎస్ సంస్థ అదినేత రాచరాయుడు,వీర నాగయ్య పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు

మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకాచలపతి



మదనపల్లె, జులై 12 ప్రభాతవార్త :
వార్డుల్లో పారిశుద్యం నిర్వహిణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా వెంకటాచలపతి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 12వ వార్డు పరిధిలో ఈస్ట్‌పేట, ఎన్‌విఆర్‌లేవుట్‌లో మూడవ రోజు మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా మున్సిపల్ పారిశుద్య కార్మికులచే గడ్డి తీయించి కాలువలు శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు అంటువ్యాధులకు గురికాకుండా రోజూ ఫాగింగ్ చేయించి దోమల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డయోరియా వ్యాధికి గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. నిత్యం వార్డుల్లో తిరుగుతూ ప్రజలకు మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా వీధిదీపాలు, నీటిసరఫరా, పారిశుద్యం మెరుగుకు చర్యలు తీసుకొంటామన్నారు.

## వాసంతిని అత్యాచారం చేసిన నిందితులను ఉరితీయాలి

వాల్మీకిసంఘం రాష్ట్ర అధ్యక్షులు డిమాండ్

మదనపల్లె, జులై 12 ప్రభాతవార్త :



వాసంతిని గ్యాంప్‌రేప్ చేసి హత్య చేసిన నిందితులను ఉరితీయాలని వాల్మీకిసంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. వాసంతి హత్యాచారాన్ని నిరసిస్తూ పట్టణంలోని వాల్మీకి విగ్రహం నందు కొవ్వత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా పగిజ్యాల మండలం మచ్చుమర్రి గ్రామంలో 8ఏళ్ళ చిన్నారిని రేప్‌చేసి హత్య చేసి మృతదేహాన్ని మాయంచేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పెద్దలు ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని, మహిళా సాధికారతను కాపాడాలన్నారు. బిసి సామాజిక వర్గానికి చెందిన వాల్మీకి వాసంతి అత్యంత కిరాతకంగా గ్యాంగ్‌రేపుకు గురై హత్యకు గురై ఐదురోజులు అయినా ఇంతవరకు ప్రభుత్వం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. బాధితరాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిందితులకు మరణశిక్ష విధించేవరకు ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు మురళి, బండి బాలాజి, జయసింహ, మంజునాథ్, నరసింహులు, పార్వతి, నిర్మలమ్మ, శ్యామలమ్మ, సాకే శ్రీనివాసులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటివద్దకే వైద్య సేవలు

రామసముద్రం, జులై 12 ప్రభాతవార్త :



పెద్దకురపల్లె గ్రామ పంచాయితీలోని తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో ఇంటివద్దకే వైద్యసేవలు డాక్టర్ నూరుల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. బాలింతలకు సునీతకుమారి తల్లిబిడ్డలకు పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన ఇంజక్షన్, మందులు ఇవ్వడం జరిగింది. ప్రతి బాలింత ఆకుకూరలు, మునగాకు వంటి పౌష్టికాహారం తినాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీత కుమారి, సూపర్ వైజర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజులకొకసారి పాఠశాల పరిసరాలను శుభ్రం చేయాలి





వీరబల్లి, జులై 12, ప్రభాతవవార్త :
కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాన్ని ప్రతి రెండు రోజులకు ఒక సారి బ్లీచింగ్‌తో శుభ్రం చేసుకోవాలని ఎంపీడీఓ రామచంద్రారెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యాలయం చుట్టూ కంప చెట్లు ఉండడం అలాగే పాఠశాల చుట్టూ అపరిశుభ్రంగా ఉండడంతో ఆయన పాఠశాల సిబ్బందిపై మండిపడ్డారు. పాఠశాల పరిసరాలు ఇంత అద్వాన్నంగా ఉన్నయా అని నిర్ఘాంత పోయారు. వెంటనే బ్లీచింగ్ తో శుబ్రం చేశారు. అనంతరం పాఠశాల సిబ్బందికి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రెండు రోజులకు ఒకసారి పాఠశాల పరిసర ప్రాంతాల్లో శానిటేషన్ చేయించాలని అలాగే వాటర్ ట్యాంకును శుబ్రం చేయాలని, తెలిపారు. అలాగే పాఠశాల పరిసరాల్లో ఉన్న కంప చెట్లను తొలగించాలని ఆ గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. అలాగే ప్రతి శుక్రవవారం మరియు శనివారం నందు ఎంపీడీఓ మరియు మండల వైద్య సిబ్బంది చే శ్రమదానం కార్యక్రమము ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి మనీష, మండల విద్యాశాఖాధికారి క్రిష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ కాలువలను పూర్తి చేయండి



కమలాపురం, జులై 12, ప్రభాతవార్త:
కమలాపురం నగర పంచాయతీలో శుక్రవారం ఓపెన్ డ్రైనేజీ కాలువలు, రఖానా కాలువలను ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పరిశీలించారు. బీడీ కాలనీ, పుత్తా డిగ్రీ కాలేజీ, పెద్ద దర్గా వద్ద కాలువలు, డ్రైనేజీలను పరిశీలించి వర్షాకాలం వస్తున్నందున కాలువల లింక్‌లు పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం జిల్లా ముస్లిం మైనార్టీ నాయకుడు ఖాదర్ బాషా అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ అధికారులు, నాలుగు సచివాలయాల అధికారులు, డ్రైనేజీకి సంబంధించిన అధికారులు, నగర పంచాయతీ టీడీపీ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుడు ఆత్మహత్య

కమలాపురం, జులై 12, ప్రభాతవార్త:



పట్టణంలోని దర్గా వీధిలో నివాసం ఉంటున్న బక్కా సుబ్రమణ్యం(35) తన ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన కడప కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నారు.

## హామీని నిలబెట్టుకున్న సీఎం

కలికిరి, జులై 12, ప్రభాతవార్త:



రాష్ట్రంలోని సర్పంచులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్‌లకే దక్కుతుందని వారికి రాష్ట్రంలోని సర్పంచులందరూ రుణపడి ఉంటామని వారికి శుక్రవారం రాష్ట్ర సర్పంచుల సంఘం తరుపున కృతజ్ఞతలు తెలిపినట్లు రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.రెడ్డిరామ్ పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సైతం పక్కదారి పట్టించి సర్పంచులకు పంచాయతీలలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా అడ్డుకోవడం వైసీపీ ప్రభుత్వం చేసిందన్నారు. దీంతో రాష్ట్రంలో సర్పంచులు ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేక ఉన్నారన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు వైవి.రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, సర్పంచుల సంఘం సభ్యులు అప్పుడు తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును కలిసి తెదేపా ప్రభుత్వం వచ్చిన వెంటనే పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని విన్నవించడం జరిగింది. అప్పుడు చంద్రబాబునాయుడు మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయిస్తానని సర్పంచులకు సర్వాధికారాలు ఇస్తానని పంచాయతీలలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగాలన్నా సర్పంచుల ఆధ్వర్యంలో జరిగేలా చర్యలు తీసుకొని పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వ వైభవం తెప్పిస్తానని నారా చంద్రబాబునాయుడు హామీ ఇవ్వడం జరిగింది. అదే విధంగా గతంలో ఇచ్చిన హామీ మేరకు గురువారం రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్ బాధ్యతలు చేపట్టి పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులైన రూ.250 కోట్లు విడుదల చేస్తూ తొలి సంతకం చేయడం జరిగింది. దీంతో శుక్రవారం రాష్ట్ర సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వైవీ రాజేంద్రప్రసాద్, సంఘం సభ్యులు ఆర్థిక శాఖామంత్రిని కలిసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. సర్పంచులకు ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేసిన సీఎంకు, ఆర్థిక శాఖామంత్రికి రాష్ట్ర సర్పంచుల సంఘం తరుపున కృతజ్ఞతలు తెలిపినట్లు సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.రెడ్డిరామ్ పేర్కొన్నారు.

## పేదల వైద్యంలో రాజీలేదు

రైల్వేకోడూరు, జులై 12, ప్రభాతవార్త:
రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే వైద్యులు పేదల ఆరోగ్య విషయంలో రాజీ లేకుండా పనిచేయాలని రాష్ట్ర తెలుగు యువత నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం రైల్వేకోడూరు పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని ఆయన ఉన్నపలంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన అనారోగ్య బాధ్యతలను ఆయన పరామర్శించి వైద్య వివరాలను సేకరించారు.వైద్యం ఎలా ఉన్నది, అందుబాటులో ఉన్న వైద్యులను ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. నిరుపేదలైన వైద్యం కోసం వచ్చే వారిని ప్రేమతో వైద్య సహాయం అందజేయాలని ఆయన వైద్యులకు సూచించారు. 24 గంటలు ప్రభుత్వ ఆసుపత్రి నందు వైద్యులు అందుబాటులో ఉండి వచ్చే రోగుల పట్ల చేసి. వైద్యో నారాయణ హరి అని అన్న చందంగా వైద్యులు వారి విధులను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారందరూ నిరుపేదలేనని వారందరి మెలకువగా వైద్యం అందజేయాలని అన్నారు. ఆసుపత్రి సమస్యలు ఏవైనా ఉంటే వైద్యులు తమ దృష్టికి తేవాలని సాయి వికాస్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బ్రహ్మకుమారి, నరసింహారెడ్డి, గౌతమ్ ప్రముఖులు పాల్గొన్నారు.



## హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

కలికిరి, జులై 12, ప్రభాతవార్త:
కలికిరి మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన హౌసింగ్ నిర్మాణ పనులను అధికారులు వేగవంతం చేయాలని ఎంపీడీవో రామకృష్ణ ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ పంచాయతీరాజ్, వెలుగు శాఖల అధికారులతో ఎంపీడీవో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులతో సమావేశమై ఇళ్ల నిర్మాణాల పనులు చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఆర్థిక స్తోమతలేని లబ్ధిదారులను గుర్తించి వెలుగు అధికారులు వారికి రుణాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెలుగు సీసీలు, ఉపాధి హామీ పథకం అధికారులు పాల్గొన్నారు.



## ఆరుగురు పేకాటరాయుళ్ళు అరెస్టు

రామసముద్రం, జులై 12 ప్రభాతవార్త :
పేకాట ఆడుతున్న ఆరుమందిని అరెస్టు చేసినట్లు రామసముద్రం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కేసిపల్లె పంచాయితీ ఉప్పినెల్లి గ్రామంలో పేకాట స్థావరంపై దాడిచేసి ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న రూ.4820లు స్వాధీనం చేసుకొన్నామన్నారు. వారిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

## జ్ఞానాంబిక విద్యార్థుల ప్రతిభ



మదనపల్లెక్రైం, జులై 12 ప్రభాతవార్త :
జాతీయ స్థాయిలో జరిగిన నేషనల్ ఫైనాన్షియల్ లిటరసీ క్విజ్‌లో మదనపల్లె జ్ఞానాంబికా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఈ పోటీలు ముంబైలోని నేషనల్ ఇన్‌స్ట్యూట్‌ఆఫ్ సెక్యూరిటీసి మార్కెట్స్ యూనివర్శిటిలో నిర్వహించారు. కళాశాల తరపున విద్యార్థులు పాల్గొని మూడవ బహుమతి సాధించినట్లు కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ తెలిపారు. ఈ విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు రూ.25వేలు నగదు బహుమతి పొందారు. విద్యార్థులను కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవిలు అభినందించారు.

## లెజండరీ అవార్డ్సుకు దరఖాస్తులు ఆహ్వానం

పీలేరు, జులై 12 ప్రభాతవార్త:
2024 సంవత్సరానికి వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖులను గుర్తించి వారికి ఈనెల 28న లెజెండరీ అవార్డ్సు ప్రధానం చేయనున్నట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్. సరోజమ్మ తెలిపారు. శుక్రవారం ఈమేరకు ఆమె పత్రికా ప్రకటన విడుదల చేశారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ మాజీ భారత ప్రధాని రాజీవ్‌గాంధీ 80వ జయంతి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు స్మారక దినాన్ని పురస్కరించుకుని హైదరాబాదు రవీంద్రభారతిలో ఈనెల 28న ఆదివారం ఉదయం 9గంటలకు పురస్కారాల ప్రధానోత్సవాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. సంగీత, నత్య, చిత్రలేఖనం, అలంకరణ, ఇంద్రజాలం క్రీడలు, నటన, కవిత్వం, వైద్యం, వాస్తు, జాతకాలు, సామాజిక సేవలు జానపద గీతాలుతదితర రంగాల్లోని వారికి, కవులు, కళాకారులు, సంఘ సంస్కర్తలు, సినిమా, టీవీ కళాకారులు, దర్శకులు, నిర్మాతలు, రంగస్థల కళాకారులు, గాయనీ గాయకులు, సంగీత, నత్య కళాకారులు, విద్య, వైద్యం, న్యాయవాద, ఫ్యాషన్ డిజైనింగ్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ఇతర రంగాల్లోని విశిష్ట వక్తలు తమ పూర్తి వివరాలతో ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సంప్రదించాల్సిన నెంబర్లు 6302908528, 9705313061వాట్సాప్ నెంబర్లకు పంపాలన్నారు. అవార్డు గ్రహీతల ఎంపికలో షరతులు వర్తిస్థాయని నిర్వాహకులు తెలియజేశారు.

## ట్రిపుల్ ఐటీకి ఎంపికైన గౌతమ్ స్కూల్ విద్యార్థిని

గాలివీడు, జులై 12(ప్రభాతవార్త):
గౌతమ్ పాఠశాల విద్యార్థిని జి.మౌనిక శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం సైజుథామస్, షింటో ఇమ్మనుయల్ తెలిపారు. 2023-24 సంవత్సరం జరిగిన పదవ తరగతి ఫలితాలలో మౌనిక 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానంలో నిలిచింది. అంతేకాక ఇటీవల విడుదలైన ట్రిపుల్ ఐటీ ఫలితాలలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది.

## రైతులను ఆదుకోండి

వీరబల్లి, జులై12, ప్రభాతవవార్త :



మండలంలోని వంగిమళ్ల రైతులను ఆదుకొని వారి అనుమానాలను నివృత్తి చేయాలని యువ లాయర్ సుంకు రవీంద్ర అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీదర్ ను కోరారు. శుక్రవవారం ఆయన జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మండలంలోని వంగిమళ్లలో నెలకొల్పుతున్న హైడ్రోపవర్ ప్రాజెక్టు గత ప్రభుత్వం లో మెదలు పెట్టారని అదీ కూడా రైతులకు ఇంత వరకు ల్యాండ్ అక్విషన్స్ ప్రారంభించలేదని అలాగే రైతులకు అవార్డ్సు పాస్ చేయలేదని అందువలన రైతులు తమ భూముల్లో సాగు చేసుకోవాలో లేక వదులుకోవాలో సందిగ్ధంలో ఉన్నారని తెలిపానన్నారు. రైతులకు వారి అనుమానాలు నివృత్తి చేసి వారిని ఆదుకోవాలని తెలిపానన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

చక్రాయపేట, జులై 12,ప్రభాతవార్త:
220 కె.వి చక్రాయపేట సబ్ స్టేషన్ నుండి వెలుపడే 33 కె.వి సిద్దారెడ్డిగాపి పల్లె ఫీడర్ల నందు మరమ్మత్తుల కారణముగా నేడు శనివారం ఉదయం 8:30 గంటల నుండి 12:30 గంటల వరకు ఎల్సి ఉన్నందున 33 కె.వి కె.ఎర్రగుడి,33 కె.వి కె.రాజుపల్లి 33 కె.వి సిద్దారెడ్డిగారి పల్లె సబ్ స్టేషన్ల నుండి విద్యుత్ వెలుపడే గ్రామములలో విద్యుత్ సరఫరా ఉండదు.

## మండల సమావేశం వాయిదా

కురబలకోట, జులై 12 ప్రభాతవార్త :
కోరం లేకపోవడంతో మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన నిర్వహించాల్సిన సమావేశానికి ఎంపిటిసిలు హాజరు కాకపోవడంతో కోరం లేనందున వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఓ హరినారాయణ తెలిపారు. తదుపరి సమావేశం ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని తెలిపారు.

## పెండింగ్ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయండి

మున్సిపల్ కమీషనర్ ప్రమీళ



మదనపల్లె, జులై 12 ప్రభాతవార్త :
అర్బన్ పరిధిలో గృహనిర్మాణశాఖకు సంబంధించి వివిధ నిర్మాణ దశల్లో పెండింగ్‌లో ఉన్న ఇండ్లను వందరోజుల్లోపు పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో హౌసింగ్, స్పెషల్ ఆఫీసర్, సచివాలయ ఇంజనీర్లు, ఏసిఎం, ఏపిఓ, నోడల్ అధికారులు ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ అర్బన్ పరిధిలో 2948ఇండ్లు నిర్మాణ దశల్లో ఆగాయని, వీటిలో వందరోజుల్లో 2135ఇండ్లు పూర్తి చేయాలన్నారు. వారానికి 153ఇండ్లు చొప్పున 14వారాల్లో పూర్తి చేయాలన్నారు. ఇండ్ల నిర్మాణాలు చేపట్టే లబ్దిదారులకు రుణసౌకర్యం కూడా కల్పించాలని ఆమె అధికారులను కోరారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ హౌసింగ్ డిఈ దీనదయాల్ మాట్లాడుతూ రూరల్ మండలంలో 2414ఇండ్లుకు గానూ 1754ఇండ్లు వందరోజుల్లో పూర్తి చేయాలన్నారు. వారానికి 150ఇండ్లు చొప్పున పనులు పూర్తి చేయాలన్నారు.

## వందరోజుల్లో పెండింగ్ ఇండ్లును పూర్తి చేయాలి

మండల స్పెషల్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి

బి.కొత్తకోట, జులై 12 ప్రభాతవార్త :



బి.కొత్తకోట నగర పంచాయితీ పరిధిలో గృహనిర్మాణశాఖకు సంబంధించి వివిధ నిర్మాణ దశల్లో పెండింగ్‌లో ఉన్న ఇండ్లను వందరోజుల్లోపు పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయంలోని హాలులో హౌసింగ్, స్పెషల్ ఆఫీసర్, సచివాలయ ఇంజనీర్లు, ఏసిఎం, ఏపిఓ, నోడల్ అధికారులు ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయితీ పరిధిలో380ఇండ్లు నిర్మాణ దశల్లో ఆగాయని, వీటిని అన్నింటిని వందరోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఇండ్ల నిర్మాణాలు చేపట్టే లబ్దిదారులకు రుణసౌకర్యం కూడా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నూర్‌జహాన్, హౌసింగ్ ఏఈ లావణ్య, ఏపిఓ మంజుల, ఇంజనీరింగ్ అసిస్టెంటు పాల్గొన్నారు.

## ఎంపిపి, జడ్పిటిసిలు రాజీనామా చేయాలి

టిడిపి నాయకులు ధర్నా

కురబలకోట, జులై 12 ప్రభాతవార్త :



వైసిపికి చెందిన ఎంపిపి, జడ్పిటిసిల పదవులకు రాజీనామా చేయాలని కోరుతూ కురబలకోట మండల టిడిపి నాయకులు శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంటరీ బిసిసెల్ అధ్యక్షులు సురేంద్ర యాదవ్, మాజీ కన్వీనర్ ఎల్లారెడ్డి, మేజారి సదాశివ, చంద్రశేఖర్‌రాజు, మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పాదయాత్ర చేపట్టిన సమయంలో ఆయన పట్ల అనుచిత వ్యాఖ్యలతో హేలన చేస్తూ మాట్లాడారని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం జరగనున్న మండల సమావేశానికి ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరు కాలేదు. సభ వాయిదావేయడంతో ఎంపిడిఓ కార్యాలయం ఎదుట టిడిపి నాయకులు అధికసంఖ్యలో పాల్గొని నినాదాలు చేస్తూ ధర్నాచేశారు. ఈ కార్యక్రమంలో పిచ్చలవాండ్లపల్లె సర్పంచ్ సురేంద్ర, తెట్టు సర్పంచ్ భాస్కర్, తుమ్మచెట్లపల్లె సూరి, అయూబ్‌ఖాన్, లక్ష్మన్న, మదూకర్‌రెడ్డి, శాలిని, మల్లికార్జున, ఆలంవలీలు పాల్గొన్నారు.

## అలరించిన భాగవతారిని రెడ్డికుమారి

కలికిరి, జులై 12, ప్రభాతవార్త:
హరికథా గానం కలికిరి-కలకడ రోడ్డు మార్గంలోని మహల్ క్రాస్‌లో జరుగుతున్న మహాభారతంలో భాగంగా శుక్రవారం బంగారుపాలెం చెందిన భాగవతారిని శ్రీమతి రెడ్డికుమారి ఆలపించిన కర్ణ జననం హరికథ గానం అందరిని అలరింపజేసింది. ఈ నెల 10 నుంచి మహాభారత యజ్ఞం డీసీ సాద్విక్‌రెడ్డి రిటైర్డ్ వీఆర్వో మదన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి అమరావతమ్మ, వివిధ పంచాయతీ పెద్దల సహకారం మహాభారత యజ్ఞం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బంగారుపాలెం మండలం భాగవతారిని పగటి హరికథలు, రాత్రివేళ నాటకాలు శ్రీ వెంకటేశ్వర నాట్యకళామండలి వారితో మహాభారత యజ్ఞం నిర్వహించడం జరుగుతున్నది. శుక్రవారం రెడ్డికుమారి ఆలపించిన కర్ణ జననం హరికథకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో హారోమనిస్టు సుబ్రమణ్యం, వయోలిన్ చెంగల్‌రాయుడు, తిరుపతి తబలిస్టు నారాయణప్ప బృందం తదితరులు పాల్గొన్నారు. ఈ మహాభారత యజ్ఞం ఈనెల 10 నుంచి ఈనెల 28 వరకు కార్యక్రమాలు జరుగుతాయని ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ధర్మకర్త మదన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.



# నిత్యావసర ధరలు కట్టడి చేస్తాం



కడప వైద్యవిభాగం, జులై 12, ప్రభాతవార్త:
రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పిన విధంగా నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేస్తూ పేద ప్రజలకు అన్ని విధాలా తోడ్పాటు అందించడం జరుగుతుందని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని రైతు బజారులో సబ్సిడీ ధరలతో నిత్యావసర సరుకులు అందించే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత వైకాపా పాలనలో నిత్యావసర సరుకుల ధరలు అధికంగా ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కడప రైతు బజారుతో పాటు మండీ బజారు, ఇతర షాపింగ్ మార్ట్‌లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి తక్కువ ధరలకు నిత్యావసరాలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నేతలు, ఇతర నాయకులు, రైతు బజారు అధికారులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలను పూర్తి చేయించండి

పుల్లంపేట, జూలై 12, ప్రభాతవార్త:
పుల్లంపేట మండలంలోని అసంపూర్తిగా ఆగిపోయి ఉన్న గృహ నిర్మాణాలను వెంటనే సంబంధిత లబ్దిదారులతో మాట్లాడి పూర్తి చేయించాలని మండల ప్రత్యేక అధికారి ఎం.మహేశ్వర్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు అందరి సమన్వయంతో అసంపూర్తిగా ఆగిన గృహ నిర్మాణాలకు సంబంధిత లబ్దిదారులతో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించి గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అందుకు అధికారులు అందరూ ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన అన్నారు. అలాగే మండలంలో వివిధ గ్రామ పంచాయతీలోని విద్యుత్ దీపాలు, మురుగునీటి కాలువలు,రోడ్లు, త్రాగునీరుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహామూర్తి, హౌసింగ్ ఏఈ విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దినేష్, ఏపీఓ శ్రీనివాసులు, ఏపీఎం సుబ్బలక్ష్మి, హౌసింగ్ వర్క్ఇన్స్‌పెక్టర్ భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మైదుకూరు జులై 12, ప్రభాతవార్త :
మైదుకూరు డివిజన్ పరిధిలోని మైదుకూరు.చాపాడు మండల పరిధిలో నేడు 33కెవి మరియు 11కెవి విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కావునా మైదుకూరు మరియు చాపాడు మండల పరిధిలోని వినియోగదారులు విద్యుత్ అంతరాయ వేళలను గమనించగలరని ఎలక్ట్రికల్ డిప్యూటి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు శ్రీనివాసులరెడ్డి తెలియజేశారు.

## భూసార పరీక్షలు తప్పనిసరిగా చెయించాలి



లక్కిరెడ్డిపల్లె, జులై 12, ప్రభాతవార్త:
ప్రతి ఏటా పంట పూర్తైన తరువాత భూసార పరిక్షలు తప్పని సరిగా చెయించాలని లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ సహాయ సంచాలనకులు జయరాణి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంపూర్ణత అభియాన్, ఆస్పిరేషన్ బ్లాక్స్ పోగ్రాంలో భాగంగా శుక్రవారం రాచపల్లె గ్రామంలో ముప్పాల ఆనందరాజు అనే రైతు పొలంలో భూసార పరిక్షలు చెయించారు.ఈ సందర్భంగా ఏడి జయరాణి మాట్లాడుతూ ప్రతి రైతు తమకున్న కొద్దిపాటి పొలంలో ప్రతి ఏటా భూసార పరిక్షలు తప్పని సరిగా చెయించాలన్నారు.మట్టి నమునాలు సేకరించే విధానంలో పొలం నందు జిగ్జాగ్ పద్దతిలో 8 చోట్ల వి ఆకారంలో మట్టిని తవ్వి సేకరించిన మట్టిని క్వార్టరింగ్ పద్దలిలో నాలుగు సమభాగాలుగా,చేసి వ్యతిక భాగాలను తీసివేసి రెండు భాగాలను కలిపి జల్లడ పడుతూ అర కిలో మట్టిని పాలిథిన్ కవర్లలో పంపి అందులో రైతు వివరాలతో ఇన్వర్మేన్ష్ను ప్రయోగశాలకు ఇన్వర్మేన్ష్ను ప్రయోగశాలకు పంపిస్తామని ఆమె తెలియజేశారు. భూసారపరిక్షలు చెయడం వలన ఎరువులు ఖర్చులు తగ్గుతాయన్నారు. భూసార పరిక్షలు వలన భూమిలోని పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవచ్చన్నారు.సేంద్రియ కర్బనము ఉజదని సూచిక, లవణ లభ్యత సూక్ష్మపోషకాల లభ్యతన తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె నీతి అభియోగ అధికారి వెంకటరామిరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు కెరోలిన్, చాన్బాష, అనూష, రైతు సేవా కేంద్రం అధికారి నాగారాజు, పవన్, సాయి. కీర్తి, పరిమళ, రమ్మేషెడ్డి పాల్గొన్నారు.

## వసతిగృహాలను ఏర్పాటు చేయాలి



బద్వేలు, జూలై 12 ప్రభాతవార్త :
రాష్ట్రంలో ఉన్న అన్ని మోడల్ స్కూల్స్ నందు 6,7,8 తరగతులు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థుల కొరకు విడివిడిగా వసతిగృహలను ఏర్పాటు చేయాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ వైఎస్సార్ జిల్లా అధ్యక్షులు మానుగుంట రవిశంకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రభుత్వం మోడల్ స్కూల్స్ నందు 6వ తరగతి ప్రవేశం కొరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నదని కానీ ఎంపికైన విద్యార్థులు మోడల్ స్కూల్ నందు వసతిగహాలు లేకపోవడంతో అక్కడ చేరేందుకు వారు ఆసక్తి చూపడంలేదని తెలిపారు. అలాగే ఆయా మోడల్ పాఠశాలల నందు చదువుతున్న 6,7,8 తరగతి పిల్లలు దగ్గరలో 2,3 కిలో మీటర్ల దూరంలో ఉన్నవసతి గృహాల నుంచి వచ్చుటకు విద్యార్థుల భద్రతపై తల్లిండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కారణంతో 6వ తరగతి యందు ఎంపికైన విద్యార్థులు కూడా మోడల్ పాఠశాలల్లో చేరటం లేదని పేర్కొన్నారు. కావున ప్రభుత్వం వచ్చే విద్యాసంవత్సరం నుండ మోడల్ పాటశాలల నందు 6,7,8 తరగతులు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు విడివిడిగా వసతి గృహాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తల్లికి వందనంను కేవలం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలని ఉన్నత పాఠశాలలో విలీనమైన 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలకు తిరిగి పంపాలని విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న 117 జీవోను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం



ముద్దనూరు, జూలై 12, ప్రభాతవార్త:
విద్యుత్ సబ్‌స్టేషన్ నందు మరమ్మత్తులు కారణంగా శనివారం నాడు ముద్దనూరు మండలం అంతా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ముద్దనూరు ఏఈ రాజావర్మ తెలిపారు. అంతరాయాన్ని గమనించి ప్రజలందరూ సహకరించాల్సిందిగా వారు కోరారు.

# అభివృద్ధే ఆశయం.. అవినీతిని సహించను - ఎమ్మెల్యే పుట్టా



చాపాడు, జూలై 12, ప్రభాతవార్త:
రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి ఆశయంగా ప్రజలకు సేవ చేస్తానని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవణం నందు శుక్రవారం మండల పరిషత్ అధ్యక్షులు టి.లక్ష్మయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని, అవినీతి చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రాజోలి ఆనకట్ట నిర్మాణంలోనే కేసీ, ఆయకట్టు రైతుల కష్టాలు తీరుతాయని, రాజోలు ఆనకట్ట నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. మండల వ్యాప్తంగా యేటి పోరంబోకు రైతుల భూములకు చట్టపరమైణ హక్కులు కల్పిస్తామన్నారు. బోగస్ పింఛన్ల ఏరివేత ప్రక్రియ అధికారులు ప్రారంభిస్తారని అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పధకం ద్వారా మండలంలో అవినీతి జరిగినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యాశాఖ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయ్యవారిపల్లె గ్రామంలో నాడు నేడు పనులలో అవకతవకలు జరిగాయని విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలని టిడిపి అధికార ప్రతినిధి మునిశేఖర్ రెడ్డి సభ దృష్టికి తీసుకెళ్లారు. భద్రిపల్లె గ్రామ సర్పంచ్ గుత్తి మల్లీశ్వరి, భద్రిపల్లె పంచాయతీలో తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన వివిధ శాఖల అధికారులపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రంతులయ్య, ఈఓపిఆర్డి రాధాకృష్ణ వేణి, రీ సర్వే డిటి ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రమీళ, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ బలోపేతానికి కృషిచేద్దాం



బద్వేలు , జూలై 12 ప్రభాతవార్త :
నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషిచేసేందుకు పార్టీ సభ్యులు ఎప్పుడూ ముందంజలో ఉండాలలా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బసివి రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ, మండలాలలో ఉన్న సమస్యలను తెలుసుకుని నియోజకవర్గ కార్యాలయానికి పంపిస్తే వాటిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రతి సమస్యను నెంవేరుస్తూ ప్రజలకు మంచి పరిపాలన అందిస్తూ పార్టీ బలోపేతానికి పాటు పడుదామన్నారు. అలాగే ప్రతి ప్రభుత్వ ఉద్యోగిని కలిసి సమస్యలు వెలికి తీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించొద్దంటూ వినతి



రైల్వేకోడూరు,జులై 12,ప్రభాతవార్త:
రైల్వేకోడూరు మండలంలోని శెట్టి గుంట కొత్తపల్లి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతిని మార్చవద్దంటూ గ్రామానికి చెందిన శుక్రవారం నూరు మంది మహిళలు స్థానిక ఎంపీడీవో,ఏపీవో కు వినతి పత్రాలను అందజేశారు. గత రెండు సంవత్సరాలుగా జ్యోతి ఉపాధి హామీ పనుల్లో కొత్తగా పనిచేసేదని ప్రస్తుతం ప్రభుత్వం మారిన వెంటనే జ్యోతిని తీసివేసి మణెమ్మను ఫీల్డ్ అసిస్టెంట్ గా వేయడం దారుణమని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యంగా కొత్తగా చేరిన మణెమ్మ కూలీల పట్ల అసభ్యంగా మాట్లాడుతూ దుర్భాషలాట్లాడతాదని మహిళలు ఫిర్యాదు చేశారు.గత రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్న జ్యోతి ప్రతి ఒక్కరి పట్ల గౌరవంగా ఉండేదని కేవలం ప్రభుత్వం మారిందని కక్ష సాధింపుతో గ్రామంలో కొంత మంది అధికార పార్టీకి చెందిన నాయకులు మణిమ్మను ఫీల్డ్ అసిస్టెంట్ గా వేయడం దారుణమని, గతంలో ఉన్న ప్రభుత్వం ఇటువంటి వాటిల్లో ఎప్పుడు లేదని మహిళలు ఎంపీడీదో, ఏపీవోలతో చర్చించారు. ఏది ఏమైనప్పటికీ జ్యోతిని ఫీల్డ్ అసిస్టెంట్‌గా కొనసాగించాలని,లేని పక్షంలో నిరసనలకు ప్రజా సంఘాలతో దిగుతామన్నారు.

## సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రామాపురం, జులై 12, ప్రభాతవార్త:
మామిడి పంటల దిగుబడికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాఖాధికారి నాగమణి అన్నారు. మండలంలోని సుద్దమల్ల, నల్లగుట్టపల్లి గ్రామాల రైతులకు మామిడి పంటలో కాయల కోత తరువాత ఆచరించాల్సిన సస్యరక్షణ మరియు సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మామిడిలో కాయలు కోసినప్పటి నుంచి తగు జాగ్రత్తలు తీసుకొని నాణ్యతతో కూడిన మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. కాయలు కోసిన తరువాత 15-20 రోజులు చెట్లకు విశ్రాంతి ఇచ్చి తరువాత కొమ్మ కత్తిరింపులు చేపట్టాలని సూచించారు. గుబురుగా పెరిగిన చెట్లలో సూర్యరశ్మి, గాలి లోపలికి ప్రసరించేలా తలపైన కొమ్మలను, తూర్పు, పడమర దిక్కులలో ఉన్న కొమ్మలను, ఎండుపుల్ల, చీడపీడలు ఆశించిన కొమ్మలు, తొడిమ కొమ్మలను, ఎండిన పూత కాడలను కత్తిరించాలని తెలిపారు. కత్తిరింపులు చేసిన వెంటనే కోసిన కొమ్మ భాగానికి మరియు చెట్లు పూర్తిగా తడిచేలా 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని వివరించారు. ఈ సందర్భంగా పలు రకాల మందుల పిచికారి గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తొండూరు, జూలై 12, ప్రభాతవార్త ః
తొండూరు మండలంలోని తొండూరు, మల్లేల, భద్రంపల్లె, ఊడవగండ్ల, సంతకొవ్వూరు, అగడూరు, గోటూరు గ్రామాల్లో ఉన్న సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బి.రమేష్‌రెడ్డి తెఇలపారు. ఆయా ప్రాంతాల్లో తీగలను తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించడం, ప్రమాదకరంగా ఉన్న తీగలను సరిచేయడం లాంటి పనులు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 9.30గంటల నుండి మధ్యాహ్నం 1.00గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

### ఎమ్మెల్యే చొరవతో

## సమస్యకు పరిష్కారం

చాపాడు, జూలై 12, ప్రభాతవార్త:
మండలంలోని మదూరు గ్రామ పంచాయతీ చిన్న వరదాయ పల్లి గ్రామంలో సిమెంట్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని డ్రైనేజ్ కాలువ ద్వారా మళ్లించేందుకు గత కొద్ది రోజులుగా వీలు కుదరకపోవడంతో ఆ ప్రాంత ప్రజలకు పారిశుద్ధ్యం, దోమల బెడదతో నానా అవస్థలు పడ్డారు. శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఈ విశయమై పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగ పంచాయతీ రాజ్ అధికారులు త్వరితగదిన సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలియజేయడంతో మూడు గంటల వ్యవధిలో సమస్యను పరిష్కరించారు. గత కొద్ది రోజులుగా పరిష్కారానికి నోచుకొని సమస్యను ఎమ్మెల్యే పరిష్కరించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



రామాపురం, జులై 12, ప్రభాతవార్త:
ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, వంకలు, వాగులు ఆక్రమిస్తే చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా ఆర్డీవో రంగస్వామి అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఇసుక మట్టి రవాణా చేయాలంటే అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాలలో ప్రభుత్వ భూములను కబ్జా కాకుండా చూసుకోవాలని వీఆర్ఓలకు ఆయన సూచించారు. అనంతరం కుల ధ్రువీకరణ పత్రాలను త్వరగా పూర్తి చేయాలని ఆయన తహసీల్దారుకు వీఆర్వోలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, డీటీ సిద్దేశ్వరరావు, ఆర్ఐ రవికుమార్, వీఆర్వో విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి



పులివెందుల రూరల్, జూలై 12, ప్రభాతవార్త ః
ప్రజలందరు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని పులివెందుల మున్సిపల్ కమీషనరు రమణారెడ్డి సూచించారు. పులివెందులలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టాఫ్ డయేరియా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇళ్ల చుట్టుపక్కల మొక్కలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని, తదితర వాటి గురించి వివరించారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అజయ్, శానిటరీ ఇన్స్పెక్టరు మురళీదర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణ

## అందరి బాధ్యత

పులివెందుల రూరల్, జూలై 12, ప్రభాతవార్త ః
పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ అన్నారు. పులివెందులలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్1, 2 ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, మాదక ద్రవ్యాల నివారణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. మాదక ద్రవ్యాలు ఉపయోగించడం వల్ల ఆరోగ్యం చెడిపోవడంతో పాటు సమాజంలో చిన్నచూపునకు గురవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మోహన్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు, డాక్టర్ సి.బాలనారాయణ, పీఓలు డాక్టర్ యు.శ్రీనిత, డాక్టర్ సుగుణ, డాక్టర్ కె.విజయలక్ష్మి, ఓబుళపతి, హైమావతి, లిఖిత, వాణి, గంగిరెడ్డి, రెడ్డెమ్మ, మహేంద్రనాథ్‌రెడ్డి, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ శ్రీలతకు ఉత్తమ గైనకాలజిస్టు అవార్డు



పీలేరు, జూలై 12 ప్రభాతవార్తః
స్థానిక ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ప్రముఖ స్త్రీల వైద్యనిపుణురాలు డాక్టర్ శ్రీలతకు ఉత్తమ గైనకాలజిస్టు అవార్డు లభించింది. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రమైన రాయచోటిలోని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి డాక్టర్ శ్రీలతకు ప్రశంసాపత్రం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించి ప్రజల మన్నలను పొందడం ద్వారా ఇలాంటి ఉత్తమ అవార్డులు లభిస్తాయన్నారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మాజీమంత్రి నల్లారి అమర్నాథ్‌రెడ్డి వర్ధంతి

పీలేరు, జూలై 12 ప్రభాతవార్తః
నియోజకవర్గంలోని కలికిరి మార్కెట్‌యార్డు వద్దగల నల్లారి అమర్నాథ్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం ఉదయం పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తండ్రి మాజీమంత్రి నల్లారి అమర్నాథ్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని కలికిరి మార్కెట్ యార్డులోని నల్లారి అమర్నాద్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరుగుతుంది కావున తెదేపా నాయకులు, కార్యకర్తలు నల్లారి అభిమానులు తప్పక హాజరై నల్లారి అమర్నాథ్‌రెడ్డి వర్ధంతిని విజయవంతం చేయాలని కోరుచున్నారు. అదేవిధంగా పీలేరు నియోజకవర్గంలోని కేవి.పల్లె మండలం గుండ్రేవారిపల్లె క్రాస్, చింతపర్తి మార్కెట్ యార్డు నందు, వాల్మీకిపురం మార్కెట్ యార్డు, గుర్రంకొండ మార్కెట్ యార్డు నందుగల అమర్నాథ్‌రెడ్డి విగ్రహాల వద్ద ఆయా మండల నాయకులు, కార్యకర్తలు నల్లారి అభిమానులు నల్లారి అమర్నాథ్‌రెడ్డి 37వ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని కోరారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చివేత



పీలేరు, జూలై 12 ప్రభాతవార్తః
పట్టణ శివారుల్లో అక్రమ నిర్మాణాల తొలగింపు కార్యక్రమాలు నిర్వహించారు. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని నాయకులు విచ్చల విడిగా భూ ఆక్రమణలకు పాల్పడ్డారు. తెదేపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే భూ ఆక్రమణలు స్వాధీనం చేసుకుంటామని చెబుతూ వచ్చారు. ఈతరునంలోనే రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి భూ ఆక్రమణలపై కొరడా ఝులిపించారు. శుక్రవారం పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె పంచాయతీ సర్వే నెంబరు 909లోని చెరువు పొరంబోకు స్థలంలో చేపట్టిన ఆక్రమణ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు గుర్తించారు. వీటిని పోలీసుల సహాయంతో రెవెన్యూ అధికారులు జేసీబీలతో తొలగించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఆక్రమణలపై రాజీపడబోమని ఎంతటివారైనా స్వాధీన పరుచుకుంటామని ఆయన తెలిపారు.

## న్యాయ విజ్ఞాన సదస్సు

కడప లీగల్, జులై 12, ప్రభాతవార్త:
కడప నగరంలోని మహిళా కారాగారంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి.శ్రీదేవి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జీ శ్రీమతి కె.ప్రత్యూషల సూచనల మేరకు ట్రైనీ న్యాయమూర్తులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, సురేంద్రారెడ్డిలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాన్ ఇండియా ప్రచారం 2024లో భాగంగా జైళ్లలో ఉన్న బాల నేరస్థులను గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం ఈ ప్రచార ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని జైళ్లలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం, ఉచిత న్యాయ సహాయం, పారా లీగల్ వాలంటరీలు, లీగల్ ఎయిడ్ క్లినిక్ విధి విధానాలు తెలిపారు. అనంతరం ఖైదీల భోజనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీమతి కృష్ణవేణి, డిప్యూటీ జైలర్, మహిళా పారా లీగల్ వాలంటరీలు, కోర్టు సిబ్బంది, మహిళా ఖైదీలు పాల్గొన్నారు.

### విద్యుత్ ట్రాన్స్‌ఫారం నుండి

## కాపర్ వైర్ దొంగతనం



ముద్దనూరు, జూలై 12, ప్రభాతవార్త:
మండలంలోని చింతకుంట గ్రామ సమీపంలోని చిలకల రాజు పొలంలోని విద్యుత్ నియంత్రిక పగల గొట్టి అందులోని విలువైన కాపర్ వైర్‌ను దొంగలించినట్లు శుక్రవారం నాడు ఏఈ రాజా వర్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గురువారం రాత్రి విద్యుత్ ట్రాన్స్‌ఫారం నుండి కాపర్ వైరు దొంగతనానికి గురైనట్లు రైతు తెలిపారు. రైతు తమ పొలంలో ఉల్లి, మిరప, కాకర పంటలు వేశానని ఇప్పుడు విద్యుత్ నియంత్రిక నుండి కాపర్ వైర్ దొంగతనానికి గురి కావడంతో తమ పంటలు ఎండిపోతున్నాయని రైతు ఆవేదన వ్యక్తం చేయడంతో పంటలు ఎండిపోకుండా మరో కనెక్షన్ ద్వారా కరెంట్‌ను సప్లై చేస్తామని ఏఈ రైతుకు తెలిపారు.

వార్త
రిపోర్టర్స్ కావలెను
తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
అన్నమయ్య జిల్లా
రాయచోటి కలెక్టరేట్, రాయచోటి అర్బన్, రాయచోటి క్రైం, గుర్రంకొండ, కలకడ, పెద్దమండెం, సుండుపల్లె, మంగంపేట, వాయల్పాడు, పెద్దతిప్పసముద్రం
కడప జిల్లా
కడప కలెక్టరేట్, కడప అర్బన్, వల్లూరు, చెన్నూరు, జమ్మలమడుగు అర్బన్, మైలవరం, యర్రగుంట్ల
మీ పూర్తి బయోడేటాతో 12వ తేది శుక్రవారం క్రింది చిరునామాలో సంప్రదించగలరు
వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086